క్లుప్తంగా

కౌమార విద్యపై అవగాహన



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ రమణ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణాసంస్థ (డైట్)లో గురువారం కౌమారవిద్యపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ ప్రారంభించారు. సీనియర్ లెక్చరర్ కేవీ సూర్యనారాయణ, విషయ నిపుణులు డి.సుజాత రత్నం, డైట్ అధ్యాపకులు వివిధ విషయాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ ఎస్‌వీ రామలింగేశ్వరరావు వివిధ రకాల వ్యాధులను హోమియోపతి మందుల ద్వారా ఏవిధంగా నివారించవచ్చునో వివరించారు. ఈ సందర్భంగా డైట్ చాత్రోపాధ్యాయుల నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూడో రోజుకు తపాలా ఉద్యోగుల సమ్మె



సమ్మె చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం, అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆల్ ఇండియా డాక్ సేవక్స్ యూనియన్ రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షుడు బీవీ రమణ, కార్యదర్శి పి.భూలోకం డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం హెడ్ పోస్టాఫీసు వద్ద ఆ ఉద్యోగుల చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులకు సివిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలని, 8 గంటల పని భారం కల్పించాలని డిమాండ్ చేశారు.

విజ్ఞాన శాస్త్రంపై మక్కువ పెంచాలి



ప్రదర్శనను పరిశీలిస్తున్న హెచ్‌ఎం దుర్గాప్రసాద్

కంబాలచెరువు: శాస్త్ర విజ్ఞానంపై విద్యార్థులకు ఆసక్తిని కలిగించేందుకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదపడతాయని కంటిపూడి రామారావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పులుగుర్త దుర్గాప్రసాద్ అన్నారు. స్కూల్లో గురువారం పాఠశాల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. పదో తరగతి విద్యార్థులు కె.తనుష్, వై.దుర్గాప్రసాద్ తయారు చేసిన సన్ ఫ్లవర్ సోలార్ సిస్టమ్ మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైందన్నారు.

చంద్రశేఖరరావు సేవాగుణాన్ని కొనసాగించాలి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మంత్రి వేణు, జక్కంపూడి రాజా, చిత్రంలో తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: నున్న చంద్రశేఖరరావు సేవాగుణాన్ని కొనసాగించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. పితృవియోగంతో బాధపడుతున్న తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావు, ఆయన సోదరులు కృష్ణ, సురేష్‌లను గురువారం మంత్రి వేణు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు. అనంతరం నున్న చంద్రశేఖరరావు పెద్దకార్యం కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోన్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్, శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, మేనేజింగ్ డైరెక్టర్ బి.రవికుమార్, కంటిపూడి సర్వారాయుడు, చెరుకూరివీర్రాజు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఉప్పులూరి వీరవెంకటసత్యనారాయణ, బత్తుల బలరామకృష్ణ తదితరులు చంద్రశేఖరరావుకు నివాళులర్పించారు.

నేడు దుర్గమ్మ రథం రాక

మధురపూడి: విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి రథం శుక్రవారం ఉదయం 7 గంటలకు కాపవరం వస్తుందని, రథానికి స్వాగతం పలకడానికి స్థానిక రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి భక్తులందరూ రావాలని ఆలయ ధర్మకర్త నీరుకొండ బాబ్జీ తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు.

సీజనల్.. సందడి నిల్

- నర్సరీల్లో కానరాని సీజనల్స్ మొక్కలు
- వాతావరణ మార్పులతో తగ్గిన రకాలు



నర్సరీలో అంతంత మాత్రంగా దర్శనమిస్తున్న సీజనల్ రకాలు

కడియం: కడియం ప్రాంత నర్సరీల్లో సెప్టెంబర్ నుంచి జనవరి వరకూ కనువిందు చేసే సీజనల్స్ సందడి ఈ ఏడాది అంతంత మాత్రంగానే ఉంది. ఏటా ఈ రోజుల్లో విస్తృతమైన రకాలను ఇక్కడికి దిగుమతి చేసుకుని.. రైతులు తమ నర్సరీల్లో ప్రదర్శనకు ఉంచేవారు. తద్వారా కొనుగోలుదారులను ఆకర్షించేలా అలంకరించేవారు. ఈ ఏడాది అందుకు భిన్నంగా నర్సరీలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వేమగిరి నుంచి పొట్టిలంక వరకూ సుమారు పది కిలోమీటర్ల మేర జాతీయ రహదారికి ఒక వైపు ఆహ్లాదకరమైన రంగులతో సీజనల్స్ ఆకట్టుకునేవి. ప్రస్తుతం నర్సరీల్లో నామమాత్రంగా మాత్రమే మొక్కలు దర్శనమిస్తున్నాయి.

వాతావరణ మార్పులతోనే..

సాధారణంగా సెప్టెంబర్ చివరి నుంచి మంచు కురవడం ప్రారంభమవుతుంది. ఉష్ణోగ్రతలు కూడా నెమ్మదిస్తాయి. దీంతో సీజనల్ రకాలు ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ప్రస్తుతం అందుకు భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. పూనే నుంచి దిగుమతి చేసుకునే రకాల మొక్కలు ఇక్కడికి తీసుకువచ్చాక చనిపోతున్నాయని వివరిస్తున్నారు. ముఖ్యంగా బంతి, చామంతి, దయాంతస్, పాన్‌చిటియాలు, ఎగ్జోరా వెరైటీ.. ఇలా సీజనల్ రకాల మొక్కలు తమ సహజ అందాన్ని సంతరించుకోవడం లేదంటున్నారు. ఉన్న కొద్దిపాటి మొక్కలనే అమ్ముతున్నామని వివరిస్తున్నారు. వాతావరణానికి తోడు ఇటీవల తుపాను కారణంగా సీజనల్స్‌లో సున్నిత రకాలైన పిటోనియా, కోరింతాస్, డాలియా వంటి రకాలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు తెలిపారు.

గులాబీ రకాల ప్రదర్శన

క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి పండగ వరకూ సీజనల్స్ సందడి చేస్తాయి. ఈ రోజుల్లో సందర్శకులు నర్సరీలకు క్యూ కడతారు. అదే సమయంలో సీజనల్స్‌తో నర్సరీలు కళకళలాడేవి. ఇప్పుడు అతి కొద్ది రకాలైన సీజనల్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. గత యేడాదితో పోలిస్తే సుమారు డెబ్బై శాతం వరకూ తగ్గాయని నర్సరీ రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. దీంతో ఎప్పుడూ ఉండే గులాబీ రకాలనే ప్రదర్శనకు ఉంచుతున్నారు.

> **చనిపోతున్నాయి**
>
> వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుమతి చేసుకున్న సీజనల్స్ చనిపోతున్నాయి. దీంతో ఉన్నవాటినే నర్సరీల్లో అందుబాటులో ఉంచుతున్నాం. గత ఏడాదితో పోలిస్తే 70 శాతం వరకూ మొక్కలు దెబ్బతిన్నాయి. దీంతో హైవే వెంబడి నర్సరీల్లో సీజనల్ రకాలు తక్కువగా కన్పిస్తున్నాయి. సందర్శకుల రాక కూడా తక్కువగానే ఉంటోంది.
>
> – ఎ.శ్రీనివాస్, నర్సరీ రైతు, వేమగిరి

క్షేత్రస్థాయిలో బలోపేతం కావాలి

రాజమహేంద్రవరం సిటీ: క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం అయ్యేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక 39వ డివిజన్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి లంక ప్రసాద్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయిలో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో గార త్రినాథ్, ఎస్కే మస్తాన్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ధవళేశ్వరం: క్షయ వ్యాధిగ్రస్తులకు పూర్తి చికిత్సతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెంచేందుకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్ అన్నారు. గురువారం ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 200 మంది వ్యాధిగ్రస్తులకు ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో ఆరు నెలల పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ సూపర్ వైజర్ కుమారి, రత్నకుమారి, రామరాజు, సత్యవతి, సత్యవేణి, సీహెచ్‌వో శేషమణి పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



మాట్లాడుతున్న గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు రాజు

ప్రకాశం నగర్: గౌడ కులస్తులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు అత్తిలి రాజు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2 లక్షల 60 వేల మంది గౌడలు ఉన్నారన్నారు. బీసీ వర్గాల రాజ్యాధికారం కోసం తాము పోరాటం సాగిస్తున్నామన్నారు. కులగణన జరిగినప్పుడు చాలా మంది గౌడ కులాన్ని గవర్లు, గాండ్ల కింద చెప్పడం వల్ల మనకు రావాల్సిన రిజర్వేషన్లలో ఇబ్బంది కలుగుతోందన్నారు. గౌడ సంఘం నాయకుడు శేఖర్ మాట్లాడుతూ సంఖ్యాబలం ప్రకారం గౌడ కులస్తులు అధికంగా ఉన్నప్పటికీ రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. ఒక ఎంపీ సీటుతో పాటు రెండు ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వి.శ్రీనివాస్, మట్టా రాజు, విష్ణు, గంగధార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కడియం: మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. జేగురుపాడు, కడియం హెడ్ క్వార్టర్ ఫీడర్లకు సరఫరా ఉండదని, దీంతో కడియం, జేగురుపాడు, కడియపుసావరం గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. అలాగే 33 కేవీ చొప్పెల్ల – కడియపులంక ఫీడర్, 11 కేవీ పొట్టిలంక ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారన్నారు. దీంతో పొట్టిలంక గ్రామానికి విద్యుత్ ఉండదని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో యాగమహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న ఎంపీ భరత్ రామ్, మోనా దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో ఎంపీ భరత్ రామ్, మోనా దంపతులు నిర్వహిస్తున్న యాగ మహోత్సవం గురువారం రెండోరోజుకు చేరింది. ఇందులో భాగంగా రాజమాతంగేశ్వరి మూలమంత్ర సహిత మహా విద్యాహోమాలు, శక్తి పంచాయతన మండప పూజ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, చండీ మంత్రార్చన, లక్ష్మీగణపతి సుబ్రహ్మణ్య మన్యురుద్ర పాశుపత హోమాలు, నక్షత్ర నవగ్రహ హోమాలు, చతుర్వేద స్వస్తి, వేదాశీర్వచనము నిర్వహించారు. రుత్విక్కులు మాట్లాడుతూ రాజమాతంగేశ్వరి మూలమంత్ర స్మరణతోనే మానవుడు పవిత్రుడవుతాడన్నారు. కార్యక్రమంలో ఎంపీ భరత్, మోనా దంపతులు, వీరి కుమార్తెలు జయాని, శివాన్వి రామ్, ఎంపీ తల్లిదండ్రులు మార్గాని నాగేశ్వరరావు, ప్రసూన, సోదరుడు విజయ్ కృష్ణ, రాజమండ్రి అర్బన్ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

పీఎంపీల సమావేశాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకరరావు

కంబాలచెరువు: విజయవాడలో నిర్వహించే గ్రామీణ వైద్యుల ఐక్యత సమావేశానికి పీఎంపీలందరూ తరలి రావాలని కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు పిలుపునిచ్చారు. స్థానిక ఆనంద్ రీజెన్సీ కాన్ఫరెన్స్ హాల్లో అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు అధ్యక్షతన గురువారం అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో ప్రథమ చికిత్సలు అందించే గ్రామీణ వైద్యుల గుర్తింపునకు నిర్వహించే మహాసభకు వేలాదిగా తరలివచ్చి పీఎంపీల ఐక్యతను చాటాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించాలని, అన్ని మండలాల కార్యవర్గ సభ్యులు దీనిపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఎస్ వేణుగోపాల్, ముఖ్యసలహాదారులు ఎస్.జయసూర్య, గౌరవ సలహాదారు కోన చిన్నారావు, ఉపాధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు, సహాయ కార్యదర్శి కె.జనార్దన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి



నినాదాలు చేస్తున్న డాక్టర్ పద్మలత, కృష్ణయ్య

రాజమహేంద్రవరం సిటీ: దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలోని ఆంధ్రాభవన్ వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆమె మాట్లాడుతూ పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశ పెట్టి ఆమోదిస్తే, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు అమలవుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మహిళలకు 50 శాతానికి పైగా నామినేటెడ్ పదవులు కల్పిస్తున్నారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని మిగతా రాజకీయ పార్టీలు మహిళలకు, బీసీలకు బిల్లుకు అతీతంగా చట్టసభల్లో పోటీకి అవకాశం కల్పించాలన్నారు. ధర్నాలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, మాజీ పార్లమెంట్ సభ్యుడు వి.హనుమంతరావు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ మారేష్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లేపల్లి సుభాషిణి, బీసీ యువసేన రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బూడిద శరత్ కుమార్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు భారతరత్న ఇవ్వాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాములుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ఇవ్వాలని అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు గుడివాడ జి.వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని, విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన పెట్టాలని కోరారు. ఏటా నవంబర్ ఒకటిన పొట్టి శ్రీరాములును స్మరిస్తూ ఆంధ్రప్రదేశ్ అవతరణ వేడుకలు నిర్వహించాలన్నారు. ఆయనకు వారసులు లేనందున ఏటా డిసెంబర్ 15వ తేదీన వర్ధంతి నిర్వహించి, పిండ ప్రదానం చేస్తున్నామన్నారు. ఈ ఏడాది గోదావరి తీరంలో ఈ కార్యక్రమం కార్యక్రమం పెట్టామన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షులు గ్రంధి నానబ్బులు, ఉపాధ్యక్షుడు యక్కల నాగేశ్వరరావు, నగర అధ్యక్షుడు నల్లమిల్లి సుబ్బారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పసలపూడి రాజేష్, ఒబిలిశెట్టి రంగ బద్రి, ముత్తా రామకృష్ణ, గ్రంధి గణేష్ గుప్తా పాల్గొన్నారు.

కార్మికుల రక్షణపై న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న న్యాయ మూర్తి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల్లో ఉపాధి కల్పించే యజమానులకు గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణకు రూపొందించిన వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. పని ప్రదేశాలలో కార్మికులకు కనీస సదుపాయాలు కల్పించాలని, భద్రతా ప్రమాణాలు పాటిస్తూ హానికారక పరిస్థితులలో పనిచేస్తున్న వారికి తరచుగా వైద్య పరీక్షలు చేయించాలన్నారు. కర్మాగారాల చట్టం 1984 ప్రకారం సంబంధిత జిల్లా మేజిస్ట్రేట్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ తమ అధికారిక పరిధిలో ఉన్న ఏ కర్మాగారాన్ని అయిన ఎప్పుడైనా తనిఖీ చేసే అధికారం ఉందన్నారు. యాజమాన్యాలు తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. సదస్సులో నగర అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బీఎస్‌ఎం వలీ, రాజమహేంద్రవరం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.స్వాతి పాల్గొన్నారు.

ఆర్థిక చైతన్యంతో సమాజాభివృద్ధి

- ఎంపీ భరత్ రామ్
- మహిళలకు రుణాలపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: మహిళల ఆర్థిక చైతన్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని ఆర్యాపురంలో గురువారం వివిధ వ్యాపారాలు చేసుకునే మహిళలకు రుణ సదుపాయం కల్పించేందుకు బ్యాంకు అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ నేడు మహిళలు అన్నిరంగాలలో దూసుకుపోతున్నారన్నారు. తమ స్వశక్తితో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటూ, మరో పదిమంది మహిళలకు చేయూత అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన, ఆశయం కూడా అదేనన్నారు. మహిళల వ్యాపారాలు మరింత విస్తరింపజేసేందుకు బ్యాంకులు ముందుకు రావడం శుభపరిణామన్నారు. బ్యాంకులతో మాట్లాడి పావలా వడ్డీకే రుణాలిప్పించేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ తటవర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు ఏ వ్యాపారం పెట్టుకున్నా, ఉన్న వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుందామనుకున్నా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ బద్దిరెడ్డి సత్యనారాయణ, 34వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి పోలు విజయలక్ష్మి, నగర మహిళా విభాగం అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, సప్ప ఆదినారాయణ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

కంబాలచెరువు: బాలికలు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ టి.ఆదిలక్ష్మి అన్నారు. స్థానిక గాంధీపురం 2 నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా 9, 10 తరగతుల విద్యార్థులకు బాలల హక్కులు, బాధ్యతలపై అవగాహన సదస్సు నిర్వహించి పలు అంశాలు చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను కార్పొరేట్ స్థాయి కంటే దీటుగా తయారు చేస్తూ, సదుపాయాలు సమకూర్చుతోందన్నారు.

డ్రైనేజీల పునరుద్ధరణకు కృషి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని పలు వీధుల్లో మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రైనేజీలు పూర్తిగా పాడయ్యాయని, వాటిని త్వరితగతిన పునరుద్ధరిస్తామని ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం 15వ డివిజన్ తాడితోట, రెహ్మత్ నగర్, రెల్లిపేట పరిసర ప్రాంతాలలో పర్యటించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. కాలువల పునరుద్ధరణకు అంచనా నివేదికలు తయారు చేయాలని ఆర్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ ముత్యాల వీర అప్పారావు, క్లస్టర్ ఇన్‌చార్జి పెంకే సురేష్, ఎంహెచ్‌ఓ వినూత్న, ఆర్ఎంసీ ఈఈ శేషగిరి, డీఈ డీఎస్ ప్రకాశరావు, ఏఈ ఆంజనేయులు పాల్గొన్నారు.

జగన్ పాలన సువర్ణాధ్యాయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్



49వ సచివాలయంలో పార్టీ పతాకాన్ని ఎగురవేస్తున్న మిండి నాగేంద్ర

- అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం
- సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన రాష్ట్రంలో స్వర్ణయుగమని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి జగన్ కృషి చేస్తున్నారన్నారు. వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. 13వ డివిజన్ 31వ నంబర్ అంబేడ్కర్ నగర్ సచివాలయం–1, 50వ డివిజన్ 94వ నంబర్ సువిశేషపురం సచివాలయం, 41వ డివిజన్ 81వ నంబర్ కోటిలింగాలపేట సచివాలయంలో కార్యక్రమాలు జరిగాయి. క్లస్టర్ అధ్యక్షులు పెంకే సురేష్, బర్రే కొండబాబు, మాజీ కార్పొరేటర్ గుత్తుల మురళీధర్, సోషల్ మీడియా కన్వీనర్ రేగుళ్ల బాల శ్రీధర్ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పార్టీ, కులం, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా జగన్ ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మిండి నాగేంద్ర అన్నారు. గురువారం సాయంత్రం 20వ డివిజన్ పరిధిలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం రోడ్ వుడెక్స్ ఎదురుగా 49వ వార్డు సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఆయన, డివిజన్‌ల జేసీఎస్ ఇన్‌చార్జి కొప్పినీడి ప్రసాద్‌బాబు(రాజమౌళి) ప్రారంభించారు. నాగేంద్ర మాట్లాడుతూ సచివాలయం పరిధిలో రూ.2.21 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.10.96 లక్షలను లబ్ధిదారులకు సంక్షేమ పథకాలుగా అందించడం జరిగిందన్నారు. మాజీ కార్పొరేటర్లు మిండి మాధవి, ఏపీ రమణ, విశ్వేశ్వర ఆలయ చైర్మన్ ఎన్‌డీ శ్రీను, సచివాలయం కన్వీనర్లు దలవ కోటేశ్వరరావు, కిలిమి నారాయణరెడ్డి, తుమ్మల గణపతి, నరసింహులు అంజిబాబు, అనుసూరి రమణ, దల్లి రాజశేఖరరెడ్డి, నందిక సాయి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు పాసి కుమార్, చీకురుమిల్లి చిన్న, రొంపిచర్ల రమేష్, షేక్ ఇమాం, బిల్డర్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం

రాజమహేంద్రవరం రూరల్: సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగనన్నను మళ్లీ గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి అన్నారు. కోలమూరు సచివాలయం –3 పరిధి శానిటోరియం కాలనీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఆయన, సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. సచివాలయ కన్వీనర్లు తీటి ప్రసాద్, మెల్లిమి గాబ్రియేల్, అడ్డాల ఆనందరావు, మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, మాజీ ఉపసర్పంచ్‌లు చెరుకూరి సత్యనారాయణ, షేక్ మౌలాలి, పార్టీ నాయకులు ఎంఎం అలీ, షేక్ చాన్, ఆనెం శ్రీను, సోమిరెడ్డి సత్యనారాయణ, పిన్నమరెడ్డి సూర్యచంద్రం, పరిమి దుర్గారావు పాల్గొన్నారు.



కోలమూరు-3లో బోర్డును ఆవిష్కరిస్తున్న విష్ణుమూర్తి తదితరులు



పొట్టిలంకలో బోర్డును ఆవిష్కరిస్తున్న తాడాల చక్రవర్తి, చిత్రంలో కొత్తపల్లి వెంకటేశ్వరరావు

పారదర్శకంగా పథకాలు

కడియం: మండలంలోని పొట్టిలంక సచివాలయం – 2 పరిధిలో జరిగిన కార్యక్రమానికి మండల జేసీఎస్ చైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి ముఖ్య అతిథిగా హాజరై, పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల బోర్డును ఆవిష్కరించారు. జగన్ పాలనలో ప్రతి పథకం అర్హులకు పారదర్శకంగా అందుతోందన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి వెంకటేశ్వరరావు, వాస వీరభద్రరావు, వీరవల్లి మహాలక్ష్మి, నక్క చంటిబాబు, సిద్దాని పుల్లయ్య, నాగిరెడ్డి సూరిబాబు, రాంబాబు, నోడల్ ఆఫీసర్ లజపతి రాయ్, పంచాయతీ కార్యదర్శి తాతారావు పాల్గొన్నారు.

నరసన్న గిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధం

- నేటి ఉదయం 9.32 గంటలకు ప్రారంభం
- పూర్తయిన ఏర్పాట్లు

మధురపూడి: కోరుకొండలో కొలువుదీరిన లక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షిణ శుక్రవారం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 9.32 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీంతో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న భక్తుల కోరిక నెరవేరనుంది. గిరి ప్రదక్షిణ చేసి స్వామి దర్శనంతో కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఈ మార్గం లేనప్పుడు కొండచుట్టూ తిరగడానికి భక్తులు ఇబ్బంది పడేవారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో భక్తులకు అందుబాటులోకి వచ్చింది. 1.50 కిలోమీటర్ల పొడవు, 4 మీటర్లు వెడల్పుతో గిరి ప్రదక్షిణ మార్గం నిర్మాణమైంది. ఇందులో భాగంగా కొండ చుట్టూ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు.

ఏళ్ల కల సాకారం

ఎన్నో సంవత్సరాలు భక్తుల కల నేడు నెరవేరతోంది. ధనుర్మాసం, స్వామివారి కల్యాణం తదితర సందర్భాల్లో భక్తులు గిరి ప్రదక్షిణకు ఆసక్తి చూపుతారు. సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామి దర్శనానికి వస్తుంటారు. వీరికి అనుకూలంగా కూడా మార్గాన్ని సిద్ధం చేశారు. కొండపై నుంచి మట్టి, రాళ్లు కిందికి జారకుండా, కింది నుంచి జంతువులు మార్గంలోకి రాకుండా ఉండేందుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. స్వామివారి దేవస్థానం ఎడమవైపున గల రథం సమీపంలో నుంచి ప్రదక్షిణ మార్గం ప్రారంభమవుతుంది. కొండ వెనుక భాగంలోని ఫిల్మ్ నగర్ మీదుగా దేవుని కోనేరు వైపునకు దిగుతుంది. అక్కడి నుంచి ప్రధాన రహదారి మీదుగా దేవస్థానానికి చేరుకోవచ్చు.